


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 14-07-2026 | సంపుటి - 29 | సంచిక - 52 | రూ : 4 | పేజీలు : 8


# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

- పార్టీలకు అతీతంగా పార్లమెంటులో తెలంగాణ వాణి వినిపించండి
- అవసరమైన సమాచారం ఇస్తాం : ఎంపీల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- హాజరైన బీజేపీ ఎంపీలు ఈటల, కొండా కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డిపై
- నిపుణుల కమిటీ వేయాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రాజెక్టులు, రవాణా అనుమతులు సాధించాలని దిశానిర్దేశం
- ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయండి



- అందర్నీ సమన్వయం చేసుకోవడం కోసం తెలంగాణ భవన్‌లో ఐఏఎస్ అధికారి నియామకం

**హైదరాబాద్, 13 జూలై :** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో గళాన్ని వినిపించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దానికోసం రాజకీయాలకు అతీతంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారంనాడాయన హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఎంపీలతో భేటీ అయ్యారు. దీనికి కాంగ్రెస్ ఎంపీలతోపాటు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి కూడా హాజరయ్యారు. అధికారపార్టీ నిర్వహించే ఎంపీల సమావేశంలో ప్రతిపక్ష ఎంపీలు కూడా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా పార్లమెంటులో రాష్ట్ర ప్రయోజనాల కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని ఎంపీలందరికీ అందచేస్తామని సీఎం చెప్పారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు **తరువాయి 2లో**



# ఉద్యమ ద్రోహే కాదు.. జలద్రోహి కూడా

- ముఖ్యమంత్రికి రాజకీయ పదవీకాంక్ష
- ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు
- గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకి అన్యాయం
- గోదావరి నల్లమల్ల సాగర్ కేసు కొట్టివేతలో ప్రభుత్వ నిర్లక్ష్యం: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మెదక్ : సుప్రీంకోర్టు సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం, రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం బట్టబయలైందని, అందుకే ప్రభుత్వం వేసిన సూట్ డిస్మిస్ అయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయ పదవీ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలపై రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకోవడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి **తరువాయి 2లో**



# బద్రీనాథ్ విరాళాల కేసు

## 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ మాయం!

- కనిపించకుండా పోయిన కీలకమైన 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ
- ఆ వీడియోలను తిరిగి పొందేందుకు సాంకేతిక నిపుణుల ప్రయత్నాలు
- దర్యాప్తు కమిటీ విచారణ పూర్తి చేసి దేవస్థానం సీఈఓకు 18 పేజీల నివేదిక
- దుర్వినియోగం ఒక్కసారి కాదు, పలుమార్లు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి
- జులై 2 నాటి వీడియోలో నిందితుడు డబ్బు దుర్వినియోగం చేస్తున్న దృశ్యాలు
- ఆ ఘటనకు ముందు 14 రోజుల ఫుటేజీలో కూడా కొన్ని కీలక ఆధారాలు

**2లో**

# పెళ్లి పేరుతో భారత మహిళలకు వల

## జైషే మహమ్మద్ కొత్త కుట్ర!



- ఆన్‌లైన్‌లో పరిచయం పెంచుకుని పాకిస్థాన్‌కు రప్పించేందుకు కుట్ర
- జమ్మూకశ్మీర్ నుంచి రాజస్థాన్ సరిహద్దులపైకి ఉగ్రవాదుల దృష్టి
- గూఢచర్యం, కొత్త నియామకాలే లక్ష్యంగా ఈ డేంజరస్ ప్లాన్
- సామాజికంగా బలహీనంగా ఉన్న యువతులే వీరి ప్రధాన లక్ష్యం

**2లో**



# వియత్నాం బోటు ప్రమాదం

## 15 మంది భారతీయుల మృతదేహాలు ముంబైకి తరలింపు

- ప్రమాదానికి బాధ్యుడిగా బోటు కెప్టెన్‌ను అరెస్ట్ చేసిన వియత్నాం పోలీసులు
- గాయపడిన మరో భారతీయుడికి ఆసుపత్రిలో చికిత్స.. విజయవంతమైన వైద్య ప్రక్రియ
- మృతుల్లో ఏపీ (3), తెలంగాణ, తమిళనాడు, కేరళ వాసులు

**హనోయి / ముంబై ,13 జూలై :** వియత్నాంలోని ఫుక్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలిస్తున్నారు. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం **తరువాయి 2లో**




# ఓటర్ల జాబితా

## తల్లిదండ్రుల వివరాలపై ఈసీ కీలక ప్రకటన

- కొత్త ఓటర్ల నమోదుపై స్పష్టతనిచ్చిన ఎన్నికల సంఘం
- నకిలీ ఓట్లను ఏరివేసేందుకే ప్రత్యేక సవరణ ప్రక్రియ అని స్పష్టీకరణ
- కుటుంబాలను అనుసంధానించడమే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- బీహార్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేసి 47 లక్షల ఓట్లు తొలగింపు
- అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోరని ఈసీ హామీ

**2లో**

# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో గళాన్ని వినిపించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దానికోసం రాజకీయాలకు అతీతంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం నాడాయన హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఎంపీలతో భేటీ అయ్యారు. దీనికి కాంగ్రెస్ ఎంపీలతోపాటు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి కూడా హాజరయ్యారు. అధికారపార్టీ నిర్వహించే ఎంపీల సమావేశంలో ప్రతిపక్ష ఎంపీలు కూడా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా పార్లమెంటులో రాష్ట్ర ప్రయోజనాల కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని ఎంపీలందరికీ అందచేస్తామని సీఎం చెప్పారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి మంజూరు కోసం విజ్ఞప్తి చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ I స్వాధీనం, ఫేజ్ II విస్తరణకు సంబంధించి ఎస్బీఐక్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందనీ, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని సూచించారు. దీనికి బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో పనుల ప్రారంభానికీ, దక్షిణ భాగం భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం కోసం యత్నించాలని సూచించారు. మూసీ పునరుజ్జీవం పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అనుమతి కోసం ఆ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావాల్సి ఉన్నా, పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటకను ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరామనీ, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలని సూచించారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు ఉన్న 300 టీఎంసీల నీటిని ఆ రాష్ట్రం వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయనీ, అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఆ రెండింటిని రాష్ట్రానికి అనుకూలంగా సాధించాలని సీఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నుంచి నిరభ్యంతర పత్రాలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150 నుంచి 151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగుళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లు, ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామన్నారు. ఎంపీలు వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. పార్టీలకతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందిస్తూ, సమన్వయం చేసుకోవడానికి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని తెలిపారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఆయన దగ్గర నుంచి తీసుకోవాలని సూచించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని మల్లు రవికి సీఎం సూచించారు. రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్ సామర్థ్యం లేదనీ, స్టోరేజీ సమస్య ఉందని ఈటల రాజేందర్ అన్నారు. ప్రొటోకాల్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గద్వాల దగ్గర మూతపడిన ఆయిల్ మిల్లు పునరుద్ధరణపై మల్లు రవి అధికా రులను ప్రశ్నించారు. ఏడెనిమిది నెలల్లో పునరుద్ధరణ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటుచేయాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్ కమిటీ, కన్సల్టెన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారనీ, ఆ సమాచారం తీసుకుని ఆయా అంశాలకు సంబంధించిన పెండింగ్ విషయాలు తెలియజేస్తే పార్లమెంట్ సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు.

* **ప్రాజెక్టులపై నిపుణుల కమిటీ వేయండి-బీజేపీ ఎంపీలు**

కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి డిజైన్లలోనే లోపాలున్నాయని బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, ఈటల రాజేందర్ అన్నారు. దీనిపై నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలని కోరారు. దీనికి సీఎం ఏ రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## ఉద్యమ ద్రోహే కాదు..
# జలద్రోహి కూడా

మెదక్ : సుప్రీంకోర్టు సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం, రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం బట్టబయలైందని, అందుకే ప్రభుత్వం వేసిన సూట్ డిస్మిస్ అయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయ పదవీ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలపై రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకోవడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి పెట్టారన్నారు. అప్పుడైనా, ఇప్పుడైనా పూర్తి ఆధారాలతోనే మేం మాట్లాడుతున్నామని తెలిపారు. గోదావరి బనకచర్ల విషయంలో ఏపీ ముందుకు వెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని ఆరోపించారు. సోమవారం సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందని, 'సూట్ కూడా సరిగా వేయలేకపోయారు" అని సుప్రీంకోర్టు చెప్పిందని, కావాలనే లోపభూయిష్టమైన సూట్ వేశారన్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన కేసులో లోపాలు ఎలా ఉంటాయి? లోపాలతో కూడిన సూట్ ఎందుకు దాఖలు చేశారు? అడ్వొకేట్ జనరల్, ప్రభుత్వ న్యాయవాదులు ఏమి చేస్తున్నారు? ముఖ్యమంత్రి ఆదేశం లేకుండా ఇంత బలహీనమైన సూట్ వేయడం సాధ్యమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను తిట్టడంపైనే దృష్టి ఉంది తప్ప తెలంగాణ నీటి ప్రయోజనాలపై లేదని, గతంలో వేసిన రిట్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని, రిట్ కొట్టివేయబడిన తర్వాత వేసిన సూట్ కూడా కొట్టివేయబడిందన్నారు. నాడు గోదావరినల్లమల సాగర్ టెండర్లు పూర్తయ్యాకే కోర్టుకు వెళ్లారని, 11 డిసెంబర్ 2025న టెండర్లు పూర్తయితే, ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ వేసిందని, అందుకే రిట్ కొట్టివేయబడిందని వివరించారు. ఇప్పుడు సూట్ కూడా కొట్టివేయబడిందన్నారు. ఏడు నెలలుగా బలమైన సూట్ ఎందుకు వేయలేకపోయారు? సూట్ లోపభూయిష్టంగా ఉందని సుప్రీంకోర్టు అక్షింతలు వేసిందని, చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు అయ్యారనడానికి ఇంతకంటే పెద్ద సాక్ష్యం అవసరం లేదన్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు... తెలంగాణ జల ద్రోహి కూడా అని తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబుతో అంతర్గత ఒప్పందం చేసుకుని తెలంగాణ నీటి ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని, దేశంలోనే ఇంత లోపభూయిష్టమైన సూట్ మరొకటి ఉండదన్నారు. డిసెంబర్ 23న రేవంత్ రెడ్డి కమిటీ వేశారని, చంద్రబాబు సూచించిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించారని, ఆదిత్యనాథ్ దాస్ తెలంగాణకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ అధికారుల సమావేశాల వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో ముగ్గురు సీఎంల సమావేశంలో ఏం జరిగిందో వెల్లడించాలన్నారు. పాలమూరుకు ఎన్ఓసీ తెస్తానని తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని, పాలమూరుకు కేటాయించిన 90 టీఎంసీల నీళ్లు తెలంగాణ హక్కు.అని దానికి ఎన్ఓసీ అవసరం లేదన్నారు. రేవంత్‌కు అవగాహన తక్కువ... ఆవేశం ఎక్కువ అని దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో, నల్లమల ఎక్కడుందో కూడా ప్రభుత్వానికి తెలియదన్నారు. ఆదిత్యనాథ్ దాస్ మాటలు విని తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మానిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ శ్రీహరి, మామిండ్ల రాజేందర్, నరహరిరెడ్డి, పట్నం మానిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, విష్ణువర్దన్, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బద్రీనాథ్ విరాళాల కేసు.. 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ మాయం!

శ్రీ బద్రీనాథ్ ధామ్‌లో భక్తుల విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అత్యంత ముఖ్యమైన ఆధారంగా భావిస్తున్న 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ కనిపించకుండా పోయినట్లు వెల్లడైంది. తొలుత 45 రోజుల వీడియో రికార్డింగ్‌ను భద్రపరిచినట్లు అధికారులు తెలిపినా.. దర్యాప్తు బృందానికి అందులో 32 రోజుల ఫుటేజీ అందలేదని సమాచారం. ప్రస్తుతం ఆ వీడియోలను తిరిగి పొందేందుకు సాంకేతిక నిపుణులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనపై ఏర్పాటు చేసిన నాలుగు మంది సభ్యుల దర్యాప్తు కమిటీ విచారణ పూర్తి చేసి దేవస్థానం సీఈఓకు 18 పేజీల నివేదిక సమర్పించింది. ప్రాథమిక విచారణలో భక్తుల విరాళాలు, విలువైన వస్తువుల దుర్వినియోగం ఒక్కసారి కాదు, పలుమార్లు జరిగినట్లు గుర్తించినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విరాళాల లెక్కింపు గదిలో మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రదక్షిణ మార్గంలోని 'బ్లైండ్ స్పాట్స్' అన్నింటినీ నిఘా పరిధిలోకి తీసుకురావాలని కమిటీ సూచించింది. ఘటనకు కేవలం 14 రోజుల ముందు సీసీటీవీ ఫుటేజీ మాత్రమే లభించినట్లు తెలిసింది. గతంలో ఏర్పాటు చేసిన కెమెరాల స్టోరేజ్ సామర్థ్యం కేవలం 15 రోజులకే పరిమితమై ఉండటంతో పాత రికార్డులు అందుబాటులో లేకపోయాయి. జులై 2 నాటి వీడియోలో నిందితుడు డబ్బు దుర్వినియోగం చేస్తున్న దృశ్యాలు కనిపించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఆ ఘటనకు ముందు 14 రోజుల ఫుటేజీలో కూడా కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ కేసులో పారదర్శకత కోసం జులై 7న శ్రీ బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ కార్యాలయంలో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న ప్రమోద్ నౌటియాల్‌ను సస్పెండ్ చేసింది. విధుల నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తేలడంతో ఆయనకు ముందుగా షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం కమిటీ నిర్వహించిన విచారణలో ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు గుర్తించడంతో తదుపరి చర్యలు చేపట్టింది.

# పెళ్లి పేరుతో భారత మహిళలకు వల

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థ, భారత్‌లో విధ్వంసం సృష్టించేందుకు సరికొత్త, అత్యంత ప్రమాదకరమైన పన్నాగం పన్నింది. ప్రేమ, పెళ్లి పేరుతో భారతీయ మహిళలను వలలో వేసి, వారిని పాకిస్థాన్‌కు తరలించి, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకోవాలని చూస్తోంది. ఈ కుట్రను భారత నిఘా వర్గాలు (ఐబీ) ఛేదించాయి. జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలో గతేడాది అక్టోబర్‌లో ఏర్పాటైన 'జమాత్‌ఉల్‌మోమినాత్' (జేయుఎం) అనే మహిళా విభాగం ఈ కుట్రకు కేంద్రంగా పనిచేస్తున్నట్టు అధికారులు గుర్తించారు.

**ఆన్‌లైన్ ప్రేమ.. పాకిస్థాన్‌లో శిక్షణ**

ఐబీ అధికారుల కథనం ప్రకారం.. ఈ ఉగ్రముఠాలోని యువకులు భారతీయ మహిళలతో సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుంటున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలో నివసించే మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సుమారు ఆరు నెలల పాటు వారితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ, ప్రేమ నటిస్తూ నమ్మకం పెంచుతారు. తాము నిజమైన ప్రేమలో ఉన్నామని, పెళ్లి చేసుకుని మంచి జీవితం ఇస్తామని నమ్మిస్తారు. ఈ సమయంలో గూఢచర్యానికి సంబంధించిన సున్నితమైన ప్రశ్నలు ఏవీ అడగకుండా జాగ్రత్తపడతారు. పూర్తిగా వారిని నమ్మించి, పెళ్లికి ఒప్పించిన తర్వాత పాకిస్థాన్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తారు. పాకిస్థాన్‌కు చేరాక, వారిని ఉగ్రవాద భావజాలంతో నింపి, గూఢచారులుగా మార్చి తిరిగి భారత్‌కు పంపేందుకు ప్లాన్ చేస్తున్నారు.

**జమ్మూకశ్మీర్ నుంచి రాజస్థాన్‌పైకి దృష్టి**

గతంలో ఇలాంటి కార్యకలాపాలు జమ్మూకశ్మీర్‌కే పరిమితం కాగా, ఇప్పుడు ఉగ్రవాదులు తమ దృష్టిని రాజస్థాన్‌పైకి మార్చారు. పాకిస్థాన్‌తో రాజస్థాన్‌కు 1,070 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉండటమే దీనికి ప్రధాన కారణం. శ్రీ గంగానగర్ నుంచి బార్మర్ వరకు విస్తరించిన ఈ సరిహద్దు ప్రాంతాల్లోని యువతుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఐఎస్ఐ మద్దతు ఉన్న ఉగ్రవాదులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సామాజికంగా ఒంటరితనం అనుభవిస్తున్న, కుటుంబ సంబంధాలు సరిగా లేని, మానసికంగా బలహీనంగా ఉన్న యువతులే వీరి ప్రధాన లక్ష్యం. ఇలాంటి వారు ప్రేమ, ఆప్యాయతలకు సులభంగా ఆకర్షితులవుతారని ఉగ్రవాదులు భావిస్తున్నారు.

**మూడు మార్గాల్లో పాకిస్థాన్‌కు చేరవేత**

యువతి పెళ్లికి అంగీకరించగానే, పాస్‌పోర్ట్ సిద్ధం చేసుకోమని చెబుతారు. రాజస్థాన్ సరిహద్దుల గుండా నేరుగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించడం వీరి మొదటి ప్రాధాన్యత. అది సాధ్యం కాకపోతే, నేపాల్ మార్గం ద్వారా లేదా సౌదీ అరేబియా ద్వారా పాకిస్థాన్‌కు చేరవేసేందుకు ప్రత్యేక ఏజెంట్ల సహాయం తీసుకుంటున్నారు. ఈ మార్గాల్లో వీరిని పాకిస్థాన్‌కు చేర్చడానికి జైషేకు చెందిన ప్రత్యేక ఏజెంట్లు పనిచేస్తున్నారని నిఘా వర్గాలు తెలిపాయి. ఈ కుట్ర కేవలం గూఢచర్యం కోసమే కాదని, భారత్‌లో జైషే మహిళా విభాగం (జేయుఎం) నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు కూడా ఈ పన్నాగం పన్నుతున్నారని అధికారులు హెచ్చరిస్తున్నారు. పాక్‌కు చెరిన మహిళల ద్వారా భారత్‌లోని ఇతర యువతీయువకులను ఉగ్రవాదం వైపు ఆకర్షించేలా చేయడం కూడా వారి దీర్ఘకాలిక లక్ష్యమని స్పష్టం చేశారు.

# షాబాద్ నరహంతకుడు మృతి

కొత్తూరు : రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అతి కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన హంతక ఉన్మాది రాజ్ కుమార్ కథ విషాదంగా ముగిసింది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. కొత్తూరు మండలంలోని పెన్జర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్ సమీపంలోని వ్యవసాయ పొలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించేందుకు మృతిని సోదరుడు, పెంజర్ల గ్రామంలో నివాసముండే మేనమామలను పిలిపించారు. వారు రాజ్ కుమార్ (29) మృతదేహాన్ని గుర్తించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉంది. ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడు రాజ్‌కుమార్.. షాబాద్‌లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. దాంతో మే నెలలో ఇతనిపై బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు పెట్టారన్న కోపం పెంచుకున్న నిందితుడు.. శుక్రవారం అర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి.. ఆమె తల్లి, అమ్మమ్మను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బాలికను తీసుకొని దైవాలగూడానికి చేరుకొని, అతని సొంత ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులను కుడా కత్తితో పొడిచి చంపాడు. తిరిగి అక్కడ నుండి బాలికను తీసుకొని సుమారు 200 మీటర్ల దూరంలో బాలికను కూడా హత్య చేసి పరారయ్యాడు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి.. 'నేను ఆరుగురిని హత్య చేశాను.. నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పాడు. అయితే ఆరుగురి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కొత్తూరు మండలం పెంచర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆ మృతదేహం రాజ్ కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితునికి ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా అలవాటు ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి సుమారు రూ.2కోట్లు అప్పు చేశాడు. దాంతోపాటు అతడు 16 సిమ్ కార్డులను తీసుకొని నెంబర్లు మారుస్తూ వాడుతున్నాడు.

* **వాడిని అంత ప్రశాంతంగా చనిపోనియాల్సింది కాదు..: మృతుని సోదరుడు భాస్కర్**

అభం శుభం తెలియని పసిపిల్లలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలు తీసిన రాజ్‌కుమార్ అంత ప్రశాంతంగా చనిపోవాల్సింది కాదని, వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సిందని మృతుని సోదరుడు భాస్కర్ అన్నారు.

## వియత్నాం బోటు ప్రమాదం..
# 15 మంది భారతీయుల మృతదేహాలు ముంబైకి తరలింపు

(మొదటిపేజీ తరువాయి)

ఎయిర్‌లైన్స్ విమానంలో వారి మృతదేహాలు సోమవారం సాయంత్రానికి ముంబై చేరుకుంటాయని హనోయిలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. ముంబైకి చేరుకున్న తర్వాత మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు పంపేందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మృతుల్లో అత్యధికంగా తమిళనాడుకు చెందిన 17 మంది ఉండగా, మిగిలిన వారు ఆంధ్రప్రదేశ్ (3), తెలంగాణ, కేరళ రాష్ట్రాల వారని ప్రాథమిక సమాచారం. ఈ ప్రమాదంలో గాయపడి ఫుక్వోక్‌లో చికిత్స పొందుతున్న మరో భారతీయ పౌరుడికి ఆదివారం సాయంత్రం వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. మెరుగైన చికిత్స కోసం అతడిని సోమవారం హో చి మిన్ సిటీలోని ఆసుపత్రికి తరలించారు. అతడి కుటుంబ సభ్యులు కూడా వియత్నాం చేరుకున్నారు. మరోవైపు, ఈ దుర్ఘటనకు సంబంధించి వియత్నాం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బోటు కెప్టెన్ న్గుయెన్ హాంగ్ హై (57)ని ఆదివారం అదుపులోకి తీసుకుని క్రిమినల్ ప్రొసీడింగ్స్ ప్రారంభించారు. ప్రమాద సమయంలో బోటులో మొత్తం 32 మంది భారతీయ పర్యాటకులు ఉన్నట్లు తెలిసింది. ఈ క్లిష్ట సమయంలో సహకరించిన వియత్నాం అధికారులకు భారత రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది.

# ఓటర్ల జాబితా.. తల్లిదండ్రుల వివరాలపై ఈసీ కీలక ప్రకటన

ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేవారు తమ తల్లిదండ్రుల ఓటరు వివరాలను సమర్పించాలనే నిబంధనపై వస్తున్న ఆరోపణలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తోసిపుచ్చింది. ఇది కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధనేమీ కాదని, ఓటర్ల జాబితాలో పారదర్శకత, కచ్చితత్వం పెంచేందుకే ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని ఆదివారం స్పష్టం చేసింది. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకురావడం, వెరిఫికేషన్ ప్రక్రియను సులభతరం చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని ఈసీ తెలిపింది. కొత్త ఓటర్లు 'ఫామ్ 6' ద్వారా దరఖాస్తు చేసుకునేటప్పుడు, తమ తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యుల పేర్లు గత ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో డిక్లేర్ చేయాల్సి ఉంటుంది. పాత ఓటరు రికార్డులతో కొత్త దరఖాస్తులను అనుసంధానించడం ద్వారా నకిలీ ఓట్లకు సులభంగా అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానాన్ని గతేడాది (2025) జూన్‌లోనే బీహార్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం వర్గాలు వెల్లడించాయి. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా అక్కడ ఏకంగా 47 లక్షల నకిలీ, చెల్లని ఓట్లను తొలగించారు. ఇది ఆ రాష్ట్ర మొత్తం ఓటర్లలో దాదాపు 6 శాతానికి సమానం. బీహార్‌లో విజయవంతం కావడంతో, ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ విధానాన్ని విస్తరించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తూ మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లు ఉన్నవారి వివరాలను సేకరించి జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా జరుగుతుందని ఈసీ స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క పౌరుడు ఓటు హక్కును కోల్పోకుండా చూస్తామని హామీ ఇచ్చింది. ఏవైనా పత్రాలు వెంటనే సమర్పించలేకపోయినా, తప్పులను సరిదిద్దుకోవడానికి తగిన సమయం ఇస్తామని అధికారులు తెలిపారు. రాబోయే ఎన్నికల నాటికి అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడమే తమ లక్ష్యమని ఈసీ విశ్వాసం వ్యక్తం చేసింది.

# కోలా రవీందర్ ముదిరాజ్ కి ఎక్సలెంట్ అవార్డు 2026

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం కాలనీకి చెందిన సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ కి ఎక్సలెంట్ అవార్డు 2026 లభించింది. సుజనా ఆర్ట్స్ క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో సకల కళా సమ్మేళనం సందర్భంగా ఎక్సలెంట్ అవార్డు 2026 సంవత్సరానికి దిల్సుఖ్ నగర్ లోగల బాబు జగ్జీవన్ రామ్, ఆడిటోరియంలో మాజీ కేంద్రమంత్రి డాక్టర్ వేణుగోపాల చారి ఆధ్వర్యంలో సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ను ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేసే వారిని సన్మానించడం నాకు గర్వంగా ఉందన్నారు. రవీందర్ ముదిరాజు పర్యావరణ పై నీటి పొదుపు పై, ప్రతి ప్లాటులో ఇంకుడు గుంతలు ఇంజక్షన్ బోర్ ఉండాలని, ప్లాస్టిక్ నివారించాలని, చిన్నపిల్లలకు ఈతపై అవగాహన కల్పించాలని చేస్తున్న పోరాటాన్ని తాను స్వాగతిస్తూ ఉన్నామన్నారు. ఆయన కోరిక నెరవేరాలని ఆ భగవంతున్ని ప్రభుత్వాన్ని కోరుకుంటూ, చిన్నపిల్లల నృత్యాలు చూస్తూ ఉంటే పిల్లల నైపుణ్యాన్ని ఈ విధంగా బయటికి తీయడం ఆనందదాయకమన్నారు. చిన్నపిల్లలకు ఫోన్లు ఇవ్వడం ప్రమాదకరం ఈరోజు చిన్నపిల్లలు ఫోన్ చూస్తేనే భోజనం చేస్తున్నారని కనబడుతుంది అందుకని చిన్న పిల్లలకు ఇటువంటి కళా నైపుణ్యాన్ని నృత్యాలను చేయిస్తూ నేర్పించాలన్నారు. కలలను కాపాడుకోవాలని అన్నారు, తదుపరి అవార్డులను అందజేశారు. ఆర్ఆర్ పిల్లే కు కూడా అవార్డు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో రాజేంద్ర కుమార్ పూనా




ఆర్టిస్ట్, డాక్టర్ సముద్రాల శ్రీదేవి , డాక్టర్ భాగ్యలక్ష్మి రెడ్డి, వీర భోగ వసంతరాయులు ప్రజా ప్రతి, తదితరులు పాల్గొని వివిధ రంగాల్లో విద్యార్థులు నృత్య ప్రదర్శన అద్భుతంగా చేయడంతో విద్యార్థులకు బహుమతులు మేమె టోలు, అందజేశారు. ఈ కార్యక్రమానికి వచ్చినటువంటి పిల్లల తల్లిదండ్రులు ప్రేక్షకులు ఎంతో ఆనంద ఉత్సవాల్లో మునిగిపోయారు. ఆడిటోరియం అంత చప్పట్లతో మారుమోగింది అవార్డు రావడంతో రవీందర్ మాట్లాడుతూ తనపై ఇంకా బాధ్యత పెరిగిందని భావిస్తున్నానన్నారు. మునుముందు నా సాయి శక్తుల ప్రజలకు సేవ చేస్తానని సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటానని ఆ భగవంతుడు నాకు మీ అందరి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరారు.

## సింగరేణి ఉద్యోగుల సమస్యలపై కేంద్రమంత్రి కి వినతి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : సింగరేణి సంస్థ ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలపై గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ , రాజిరెడ్డి ఆదేశాల మేరకు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి టీబీజీకేఎస్ ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా కాపు కృష్ణ మాట్లాడుతూ వేలానికి సిద్ధంగా ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. గతంలో ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేసి, ఆ బ్లాకులను తిరిగి సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. పర్యావరణ , అటవీ అనుమతులు సింగరేణి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కు ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు పెండింగ్ లో ఉన్న పర్యావరణ అటవీ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. సింగరేణిలో ఎన్నికల నిర్వహించాలని ఆయన కోరారు . ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసాన వీరభద్రం, వైస్ ప్రెసిడెంట్లు తుమ్మ శ్రీనివాస్, గడప రాజయ్య పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

*** సిపిఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్**




రఘునాథ్ పల్లి, ప్రజాస్ఫూర్తి : స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్) పై పార్టీ బూతు ఏజెంట్లు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ పిలుపునిచ్చారు రఘునాథ్ పల్లి మండల పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన భూతూ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారి పేర్లు అన్యాయంగా తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలిస్తూ కొత్త ఓటు పొందిన యువత మహిళలు ఇతర అర్హులైన అందరూ పేర్లు నమోదయ్యేలా సహకరించాలని కోరారు ఓటు హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు ఎవరికి అన్యాయం జరగకుండా బూత్ ఏజెంట్లు బాధ్యతారహితంగా వ్యవహరించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పొదల నాగరాజు మండలి ఎల్లయ్య గూళ్ళ లింగరాజు మండలి సంపత్ మండలి సరేందర్ తదితరులు పాల్గొన్నారు

## టేకుమట్లలో రూ.2.50 కోట్ల సీసీ రోడ్ల ప్రారంభం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి నియోజకవర్గంలోని టేకుమట్ల మండలంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పలు సీసీ రోడ్లను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ప్రారంభించారు. గర్మిళ్లపల్లి, పంగిడిపల్లి, వెంకట్రావుపల్లి, దుబ్యాల, టేకుమట్ల గ్రామాల్లో చేపట్టిన ఈ అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, మహిళా సంఘాల బలోపేతం, పశుపోషణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అనంతరం టేకుమట్ల మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం రూ.1,00,116 ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడిసె వాసులకు డబుల్ బెడ్రూంలు కేటాయించాలి



ఉప్పల్, ప్రజాస్ఫూర్తి : రామంతపూర్ పెద్దచెరువు గుడిసె వాసులకు డబుల్ బెడ్రూంలో ఇల్లు కేటాయించాలని ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ అన్నారు. సోమవారం శామీర్ పేట లోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో కలెక్టర్ మను చౌదరి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదప్రజానీకానికి అండగ ఉండాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుడిసె వాసులుతో పాటు బిజెపి నాయకులు సోమశేఖర్ గౌడ్, రఘుపతి గౌడ్ తదితరులు కలిశారు.

## టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదుకు జూలై 20 వరకు గడువు



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు ఈ నెల 20వ తేదీలోగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వం పొందాలని జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం నిరంతరం పోరాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశేష సేవలు అందిస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అని పేర్కొంటూ, సంఘం మరింత బలోపేతం కావాలంటే ప్రతి జర్నలిస్టు సభ్యత్వం తీసుకుని తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఆగస్టు మొదటి వారంలో జిల్లా మహాసభను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి తోపాటు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు తదితర రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరుకానున్నట్లు తెలిపారు. సభ్యత్వం పొందిన ప్రతి జర్నలిస్టుకు యూనియన్ ఐడీ కార్డుతో పాటు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) లోగోతో కూడిన టీషర్ట్, బ్యాగ్ ను గుర్తింపు కోసం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిస్టుల సమస్యలు, ఇళ్ల స్థలాల అంశంపై మహాసభ వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. సభ్యత్వ దరఖాస్తు (PDF) ను అన్ని జర్నలిస్టుల వాట్సాప్ గ్రూపుల్లో అందుబాటులో ఉంచుతున్నామని, దానిని ప్రింట్ తీసుకుని ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో పూర్తి వివరాలు నమోదు చేసి జూలై 20లోపు సమర్పించాలని సూచించారు. కాటారం, మహదేవ్‌పూర్, పలిమెల మండలాలకు చెందిన వారు సీనియర్ జర్నలిస్ట్ లు అయిన కొట్టే శ్రీశైలం, ఎం.ఎస్.ఎల్. మూర్తికి, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన జర్నలిస్టులు కాట్రేవుల ఐలయ్య, పుల్ల రవితేజకు, టేకుమట్ల మండలానికి చెందిన జర్నలిస్టులు తిరుమలేష్, నరేష్‌కు, రేగొండ, గోరుకొత్తపల్లి మండలాలకు చెందిన వారు కటకం రాజు, అంబాల రవీందర్‌కు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మిగిలిన మండలాల జర్నలిస్టులు జిల్లా కేంద్రంలోని జర్నలిస్టు లు భూపాలపల్లి ప్రెస్ క్లబ్‌లో లేదా 9676185018 కు సభ్యత్వ ఫారాలను సమర్పించాలని కోరారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకుని ఆగస్టు మొదటి వారంలో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

*** జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, పారదర్శకంగా విచారణ నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం లేదా సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.

## జగన్నాథ రథయాత్ర కరపత్రం ఆవిష్కరణ




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో జూలై నెల 20వ తేది సోమవారం నాడు జరిగే ఇస్కాన్ రథయాత్ర ఉత్సవాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సోమవారం ఇస్కాన్ హైదరాబాదు సోరాన్ గౌరంగాదాస్ మరియు భక్తుల ఆద్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి ని వారి నివాసంలో కలిసి జగన్నాథ రథయాత్రలో పాల్గొన వలసిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ రథయాత్ర కరపత్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ ఆవిష్కరించి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో ఇస్కాన్ రథయాత్ర కార్యక్రమం జూలై నెల 20 తేదీన జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ గా ఉన్న సమయంలో ఇటువంటి కార్యక్రమం సూర్యాపేటలో జరగడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ గౌరంగాదాస్ మాట్లాడుతూ జూలై నెల 20 వ తేదిన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక గీతా మందిరం నుండి జగన్నాధ రథయాత్ర ఉత్సవం మొదలై, పూల సెంటర్, 60 ఫీట్ల రోడ్ , కొత్త బస్టాండ్ మీదుగా తిరిగి పబ్లిక్ క్లబ్ వద్దకు చేరుతుందని అన్నారు. పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపాటి కిరణ్, కర్నాటి హేమంత్, మొరిశెట్టి కోటేశ్వరరావు, రాచకొండ శ్రీనివాస్ జూలకంటి నాగరాజు, కక్కిరేణి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి సమాజంలో చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలి

*** నల్లగొండ 20వ డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్.**



ప్రజాస్ఫూర్తి.నల్లగొండ : పట్టణంలోని అవుట్డోర్ స్టేడియంలో జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హాకీ చాంపియన్ గా నిలిచిన హాకీ టీమ్ ను సోమవారం ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా 21 డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా జట్టులో గొల్లగూడ పెద్దబండకు చెందిన యువకులు కఠోరశ్రమతో హైదరాబాద్ లాంటి జట్టను మట్టి కరిపించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ యావార్ కేలో ఇండియా కోచ్ ఆలేరు రావుల మురళి రావుల శేఖర్ శివంగి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు బొమ్మ రమేష్ యాదవ్, రావుల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు

## గంజాయి మత్తులో వృద్ధురాలి పై అత్యాచారం.. నిందితుడు అరెస్ట్

చిల్పూర్/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. గంజాయి మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఒంటరిగా ఉన్న 78 ఏళ్ల వృద్ధురాలి పై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణ లు ఉన్నాయి. ఘటన పై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి నిందితుడు రాజేష్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ లో గంజాయి మత్తులోనే ఈ దారుణాని కి పాల్పడినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## టాస్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (TOSS) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎస్ ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రాస్పెక్టస్ కమ్ దరఖాస్తు పత్రాలు జూన్ 29 నుంచి ఆగస్టు 29 వరకు అందుబాటులో ఉంటాయని, అభ్యర్థులు మీ సేవ, టీజీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆలస్య రుసుము లేకుండా జూలై 28 వరకు, ఆలస్య రుసుముతో ఆగస్టు 29 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 14 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన డ్రాప్‌అవుట్ విద్యార్థులు ఎస్ఎస్‌సీ (టాస్ ) కోర్సుకు, 16 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై చదువు మధ్యలో నిలిపివేసిన వారు ఇంటర్మీడియట్ (టాస్) కోర్సుకు అర్హులని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం సమీప మీసేవ, టీజీఆన్‌లైన్ కేంద్రాలు లేదా టాస్ అక్రిడిటెడ్ ఇన్‌స్టిట్యూషన్ (ఎఐ ) కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ సంకీర్త్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. సీసీటీఎన్ఎస్ (2.0)లో కేసులను సకాలంలో నమోదు చేసి వివరాలను నిరంతరం నవీకరించాలని, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాల విస్తరణ, బ్లాక్‌స్పాట్ల గుర్తింపు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇసుక, మొరం రవాణాపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, మొరం సరఫరా పారదర్శకంగా జరిగేలా ఈ సాండ్ పోర్టల్ ద్వారా మాత్రమే బుకింగ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. సోమవారం చౌడారం మోడల్ పాఠశాల సందర్శన కు వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యం లో ఇసుక, మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, డ్రైవర్ల వద్ద ఆన్‌లైన్ కూపన్లు ఉన్నాయా లేదా పరిశీలించారు. ఈ సాండ్ పోర్టల్ ద్వారా నాణ్యమైన ఇసుకను నిర్ణీత ధరలకు ప్రజలకు అందించడం తో పాటు అక్రమ ఇసుక, మొరం రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

# ఉచిత కుటుంబ నియంత్రణ సేవలను అర్హులైన దంపతులు వినియోగించుకోవాలి

* **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రపంచ జనాభా దినోత్సవం, 11 జూలై నుండి 18 జూలై, 2026, నిర్వహణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల , మెదక్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు.జిల్లాలో పర్మనెంట్ , టెంపరరీ ఫ్యామిలీ ప్లానింగ్ స్పేసింగ్ మెథడ్స్ (గర్భ నిరోధక పద్ధతులు , ట్యుబెక్టమి, వాసెక్టమి, గర్భ నిరోధక మాత్రలు) వాడుతున్న కుటుంబాలకు జిల్లా కలెక్టర్ శాలువాలు కప్పి అభినందించారు.పిల్లల మధ్య సరైన అంతరం ఉంటే, కుటుంబాలు ఆరోగ్యంగా వుండి వైపుణ్యంతో ఉంటాయని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్ ,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.జయశ్రీ , మాస్ మీడియా అధికారి అన్వర్ పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపల్లిలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే దంపతులు, డాక్టర్ అంబేద్కర్ సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం జీవితాలను అంకితం చేశారని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జ్యోతిరావు పూలే నిరూపించారని, అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం వల్లే ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఊచలు లెక్క పెట్టాల్సిందే




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సీనియర్ న్యాయవాది, వై. చెన్నమల్లారెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మాట్వడా గ్రామ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది చెన్నమల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే ర్యాగింగ్ చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ర్యాగింగ్ అనేది ఒక సామాజిక మహమ్మారి అని, విద్యా సంస్థల్లో దీని నివారణకు కఠినమైన చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. తోటి విద్యార్థులను వేధించడం లేదా ఇబ్బందులకు గురిచేయడం వల్ల కలిగే నష్టాలను, దానివల్ల ఎదురయ్యే చట్టపరమైన శిక్షలను ఆయన విద్యార్థులకు వివరించారు. సరదాగా చేసే పనులు జీవితాలను నాశనం చేసుకునే స్థాయికి చేరకూడదని హితవు పలికారు. విద్యార్థి స్థాయి నుండే ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కులు, విధులతో పాటు చట్టాల పట్ల ప్రాథమిక అవగాహన పెంచుకోవాలని కోరారు. ముఖ్యంగా బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక ( నిషేధం & నియంత్రణ ), సైబర్ నేరాలు , పోక్సో చట్టం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసం సారంగపాణి , హాస్టల్ వార్డెన్ శ్రీకాంత్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# 11 పోస్టులకు నోటిఫికేషన్.. 14 వరకు దరఖాస్తులు

జనగామ, (ప్రజాస్ఫూర్తి): జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్ -I, II కార్యాలయాల్లో ఔట్సోర్సింగ్ విధానంలో 11 ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా కేడర్‌కు చెందిన అర్హులైన అభ్యర్థులు జూలై 14 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని అధికా రులు తెలిపారు. మొత్తం 11 పోస్టుల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ 3, ఆఫీస్ సబా ర్డినేట్ 5, చైర్మన్ 2, స్వీపర్ 1 పోస్టులు ఉన్నాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు లకు డిగ్రీ, పీజీడీసీఏ (ఎంఎస్ఆఫీస్) అర్హతతో రూ.19,600 వేతనం, మిగ తా పోస్టులకు ఇంటర్మీడియట్, పీజీడీ సీఏ అర్హతతో రూ.15,600 వేతనం చె ల్లించనున్నారు. దరఖాస్తుల స్వీకరణ జూలై 10 నుంచి 14 వరకు కొనసాగు తుంది. రాత పరీక్ష జూలై 15 ఉదయం 11 గంటలకు జనగామ కలెక్టరేట్ ఐడీ ఓసీ కాంప్లెక్స్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్నారు. అభ్య ర్థులు జిల్లా ఉపాధి అధికారి కార్యాల యంలో నేరుగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా దరఖాస్తులు సమర్పించాలి.వ యోపరిమితి 18 నుంచి 46 సంవత్స రా లుగా ఉండగా, ప్రభుత్వ నిబంధన ల ప్రకారం రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు ఉంటుంది. ఎంపిక మెరిట్, రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ఆధారం గా జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థు లు గడువులోపు దరఖాస్తు చేసుకోవా లని జిల్లా అధికారులు సూచించారు.

# ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ లో సోమవారం రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ , మెడిసిటీ ఆసుపత్రి వారి సౌజన్యం తో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిభిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 350 మంది కి వైద్యులచేత పరీక్షలు చేయించుకొని, ఉచితంగా మందులు పొందారు.ఈ కార్యక్రమంలో చింతల్ సర్కిల్ ఉప కమీషనర్ స్పందన, మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు చక్రవర్తి రెడ్డి, డాక్టర్ ఎం. వి. సుబ్బారావు లు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మి నాథ్, రోటరీ సభ్యులు వెంకట్ రెడ్డి, అభిషేక్ రెడ్డి,ధనుంజయ,మెడిసిటీ ఆసుపత్రి సిబ్బంది, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఖమ్మం టేకులపల్లి గురుకులంలో

# విద్యార్థుల కు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం జిల్లా టేకులపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులు వినియోగించే బాత్రూములు పరిశుభ్రంగా లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. అదే సమయంలో ఉపాధ్యాయులకు పరిశుభ్రమైన బాత్రూములు సౌకర్యం ఉండగా. విద్యార్థులకు మాత్రం అధ్వాన్న స్థితిలో ఉన్న బాత్రూంలోనే వినియోగించాల్సి వస్తుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాత్రూముల్లో పరిశుభ్రత లోపించడం, తగిన నీటి సౌకర్యం లేకపోవడం, నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్య సమస్యలకు గురయ్య ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు . పాఠశాలల్లో పరిశుభ్రమైన , పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆరోగ్యం, గౌరవం విద్యాభ్యాసానికి అత్యంత అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు .ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి విద్యార్థుల బాత్రూములను శుభ్ర పరచడం, అవసరమైన మరమ్మత్తులు చేపట్టడం, నిరంతర నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు,విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థులు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం లో చదువుకునేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.



# ఆరోగ్యం—విద్యకు ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మొగుళ్లపల్లి, ప్రజాస్ఫూర్తి : ఆరోగ్యం, విద్యే జీవితంలో అత్యంత విలువైన సంపదలని, ఈ రెండు రంగాల అభివృద్ధికే రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల-కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరూ ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ విజయవంతంగా నిర్వహించినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ గొడిశాల నవత గౌడ్ తెలిపారు. అదే విధంగా మొగుళ్లపల్లి మండలంలోని 26 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీదేవి, మండల వైద్యాధికారిణి డాక్టర్ గొడిశాల నవత గౌడ్, ఇతర వైద్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది

* **తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మర్పల్లి మండలం పట్లూరు గ్రామంలో రూ. 3.04 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్ ను , మర్పల్లి మండల కేంద్రంలో రూ. 25 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాధమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని సోమవారం ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం మర్పల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు పర్వీన్ బేగం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయంగా నాకు జన్మనిచ్చిన మర్పల్లి అంటే నాకు ఎంతో ఇష్టం. అందుకే మర్పల్లి మండల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకుమండల వైద్య సేవలు అందుబాటులో ఉండే విదంగా ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఆధునికీకరణ చేయిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో లో ఓల్టేజి కరంటు సమస్యలు లేకుండా అవసరమైన నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. నియోజకవర్గంలో కూడా స్వంత ఇల్లు లేని పేదలందరికి ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికి ఇళ్ళను మంజూరు చేయిస్తానని, భవిష్యత్తులో నియోజకవర్గంలో అందరికీ స్వంత ఇళ్ళు ఉండాలని నా కోరిక అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సర్ పప్పులుడకవు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : "తెలంగాణ నేల ఒక నిప్పుకణిక.. ఇక్కడ డిల్లీ కుయుక్తుల వ్యూహాలు పారవు! ప్రజల ఆత్మగౌరవ పోరాటాల ముందు..ఎంతటి అధికార శక్తులైనా నిలువలేవు!"విశ్వ జంపాల అడ్వకేట్, విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ భారతదేశ రాజకీయ యవనికపై ఒక్కో ప్రాంతానిది ఒక్కో నైజం. ఉత్తరాది రాష్ట్రాల్లో సాగే సాంప్రదాయ సమీకరణాలు విద్యావంతులు, ఉద్యమకారులతో కూడిన దక్షిణాది రాష్ట్రాలపై పని చేయవు. మరీ ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో సాగే కుల, మత, ప్రాంతీయ చదరంగం తెలంగాణ మట్టిపై అస్సలు సాగదు. ఎందుకంటే, తెలంగాణ కేవలం ఒక భౌగోళిక సరిహద్దు కాదు, అదొక నిరంతర పోరాటాల సజీవ సాక్ష్యం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరిట సాగుతున్న ''సర్'' డ్రైవ్ తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. 2002 నాటి పాత లింకులను, సాంకేతిక కొర్రీలను సాకుగా చూపుతూ కొన్ని రాష్ట్రాలలో లక్షలాది మంది ప్రతిపక్ష, హిందూయేతర ఓటర్ల పేర్లను జాబితాల నుండి తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటి 'ఓటు హక్కు'ను హరించే ఈ

# మహిళను గుర్తిస్తే సమాచారం ఇవ్వండి

**: పట్టణ సీఐ మహేష్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని సాయి దత్త థియేటర్ సమీపంలో నిన్న ఓ మహిళకు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిపోయారు. ఈ విషయాన్ని గమనించిన మెదక్ టౌన్ పోలీస్ పెట్రో కార్ సిబ్బంది వెంటనే స్పందించి, ఆమెను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ మహిళ తన పేరు, చిరునామా లేదా కుటుంబ సభ్యుల వివరాలను తెలియజేయ లేని స్థితిలో ఉన్నారు. ఈ మహిళను ఎవరైనా గుర్తించినా లేదా ఆమె కుటుంబ సభ్యులకు సంబంధించిన సమాచారం తెలిసినా 8712657913, 9573553398 నంబర్స్‌కు సమాచారం ఇవ్వాలని, లేదా టౌన్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని పట్టణ సీఐ మహేష్ తెలిపారు.

# గౌరవెల్లిపై బీఆర్ఎస్ అసత్య ప్రచారం మానుకోవాలి

* **అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర ప్రభాకర్ గౌడ్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : గౌరవెల్లి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని కాంగ్రెస్ అక్కన్నపేట మండల అధ్యక్షుడు బుర్ర ప్రభాకర్ గౌడ్ పత్రికా ప్రకటనలో తెలిపారు. 2007లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టును పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్ పూర్తి చేసిన ప్రభుత్వం గౌరవెల్లిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, సాగునీరు పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ప్రజలు అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని బుర్ర ప్రభాకర్ గౌడ్ కోరారు.

# తెలంగాణలో పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలి

* **సూర్యాపేట 2003 డీఎస్సీ ఓ పి ఎస్ పోరాట సమితి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణ రాష్ట్రంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సూర్యాపేట ఓపిఎస్ పోరాట సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఓపీఎస్ ను అమలుచేసి వాగ్దానాన్ని నిలబెట్టారని తెలంగాణలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఉపాధ్యాయులకు భరోసా కల్పించేలా సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఒకటే నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ మెంట్ జరిగిందని ఓ పి ఎస్ అనేది మా హక్కు మా భవిష్యత్తు అని మాకు ఉద్యోగ భద్రతను కల్పిస్తుందని తెలిపారు. 2003 నవంబర్ లో నోటిఫికేషన్ విడుదల చేసి 2005 నవంబర్ లో నియామకం చేయటం వల్ల అప్పటి ప్రభుత్వ పరిపాలన విధానం వలన తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. కార్యక్రమంలో 2003 డిఎస్సి ఓపిఎస్ పోరాట సమితి నాయకులు మామిడి శ్రీను, ఎం, యాదగిరి, వీరబోయిన వెంకటేశ్వర్లు, వై, అమరేందర్, టి, వెంకన్న, బి, శ్రీనివాస్ చారి, ఎండి వసివుల్లా, ఎం, శ్రీధర్ రెడ్డి, రాంప్రసాద్, ఆర్, రామచంద్రయ్య, ఎస్, రాములు, సింహాద్రి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

# నూతన డిసిసి బ్యాంకు ప్రారంభం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డిసిసి) ప్రారంభం, తాత్కాలిక ఫైర్ స్టేషన్ లను ప్రారంభించిన ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్,ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, స్టేట్ ఫైర్ డిజి విక్రంసింగ్ మాన్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ తదితరులు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత, జిల్లా ఫైర్ అధికారి శ్రీనాథ్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి,డిసిసి బ్యాంకు రీజనల్ అధికారి చైతన్య,సీఈవో సుల్తాన, స్థానిక తహసిల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.అంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మండల కేంద్రంలోనీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ (బాలికలు)లో జాతీయ నూలు పురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని జూనియర్, డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి క్లాస్ రూమ్ లు, కిచెన్, డైనింగ్,హాల్ పరిసరాలను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. పాలేరు గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని, గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని, దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. దీంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు అదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎం. మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన విద్యాధికారి శ్రీనివాస్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. రామకృష్ణ, డా. సుమన్ కళ్యాణ్, ఉప జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి , భువనగిరి, జిల్లా కౌన్సిలర్ అరుణ, రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అండలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని సోమవారం ఇల్లందు క్రాస్ రోడ్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డికి మొక్కను అందజేసి జిల్లా యంత్రాంగం తరపున ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై స్వల్పంగా చర్చించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జీవిబిఎల్ తో వ్యాపార అభివృద్ధి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ లో సభ్యత్వ నమోదుతో కమ్యూనిటీలో వ్యాపారం అభివృద్ధి చెందుతుందని జీవీబీఎల్ ఫౌండర్ అండ్ సీఈవో మంచి రాజశేఖర్, ప్రెసిడెంట్ జిల్లా ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ మినీ బ్యాంకెట్ హాల్ లో జీవిబిఎల్ సంకల్ప లీడర్స్ సూర్యాపేట లీడర్స్ కనెక్ట్ కార్యక్రమాన్ని హీరో షోరూం ఎండీ రాచర్ల కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, పరిచయాలు పెంపొందించడం, పరస్పర సహకారంతో వ్యాపార అవకాశాలను విస్తరించడం, నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జీవిబిఎల్ యొక్క విజన్ సభ్యత్వ ప్రయోజనాలు, మెట్రో నగరాల నుండి చిన్న చిన్న పట్టణాలకు కూడా వ్యాపార విస్తరణ చేయవచ్చని అన్నారు. అనంతరం సుధాకర్ పివిసి ఎండి మీలామహదేవ్, పట్టణ ప్రముఖులు మొరిశెట్టి లక్షాది, సుధాబ్యాంకు వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జివిబిఎల్ సెక్రటరీ రవి, కొందూరి ఈసీ మెంబర్ కృష్ణ మోహన్ గుప్త పట్టణ ప్రముఖ వ్యాపారులు నూక రవిశంకర్,తోట శ్యామ్ ప్రసాద్, పోలా రాధాకృష్ణ,చల్లా లక్ష్మీకాంత్, బెలిదే శ్రీనివాసులు, బోనగిరి విజయ్, రాచకొండ శ్రీనివాస్, శ్యాంసుందర్, మిట్టపల్లి రమేష్,బిక్కుమల్ల కృష్ణ, సోమ వెంకటేశ్వర్లు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధంచాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మహబూబాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల సందర్శన,సమస్యల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గర్ల్స్ ప్రైమరీ స్కూల్, జడ్పీ హెచ్ ఎస్ జమాండ్లపల్లి, జడ్పీహెచ్‌ఎస్ కంబాలపల్లి, యుపిఎస్ కొత్త రెడ్యాల, గడ్డిగూడెం యుపిఎస్ బ్రాహ్మణపల్లి, యుపిఎస్ వేమునూర్ తదితర పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా టి పి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై దాదాపు మూడు సంవత్సరాలైనా ఉద్యోగుల,ఉపాధ్యాయుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం పిఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డిఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. రాజస్థాన్, పంజాబ్, చతిస్గడ్, ఝార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో సిపిఎస్ ను రద్దుచేసి ఆ ప్రభుత్వాలు మాట నిలబెట్టుకున్నాయని తెలంగాణలో కూడా సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. టిపిటిఎఫ్ మహబూబాబాద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఘనపురం బిక్షపతి, సారెడ్డి రామలింగారెడ్డి, నాయకులు సజ్జనము వెంకటేశ్వర్లు, గునిగంటి శ్రీను, గుగులోత్ సరిరామ్, చిందం శ్రీనివాస్, భూక్య ప్రకాష్, పి సత్యనారాయణ, బండారి నరేష్, సిరికొండ నాగేశ్వరరావు, కొండ్లె రాము, చిత్రం మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ పట్టణంలో శాశ్వత నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని పూర్తి చేయాలి

* **హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గాదెపాక రవీందర్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలోని ఎల్లమ్మ బజార్ రోడ్డులో పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 20 మంది ముదిరాజ్ చేపల వ్యాపారులు తమ కులవృత్తిగా చేపలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరితో పాటు మరో 15 మంది కార్మికులు కూడా ఈ వ్యాపారంపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు.ప్రస్తుతం అదే ప్రాంతంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో, నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుందనే కారణంతో చేపల వ్యాపారులను అక్కడి నుంచి వెళ్లాలని కాంట్రాక్టర్ ప్రతినిధులు సూచించినట్లు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని తెలుసుకున్న హుస్నాబాద్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ 17వ వార్డు కౌన్సిలర్ గాదెపాక రవీందర్ ఆ స్థలాన్ని సందర్శించి చేపల వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఎన్నో ఏళ్లుగా అక్కడే చేపల విక్రయాలు చేస్తున్న వారిని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించడం సరైంది కాదన్నారు. నిర్మాణ పనులు కొనసాగించే క్రమంలో వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు తక్షణమే సమీపంలో తాత్కాలిక స్థలాన్ని కేటాయించి తాగునీరు, పారిశుద్ధ్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.అదేవిధంగా, 2022లో రూ.2.75 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసిన నాన్‌వెజ్ మార్కెట్ భవనం ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడం బాధాకరమన్నారు. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అదే సమయంలో అసంపూర్తిగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని కూడా పూర్తి చేసి చేపల వ్యాపారులకు శాశ్వతంగా దుకాణాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను కోరారు.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం

* **అధికారులకు కలెక్టర్ కె. హరిత ఆదేశం**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి : ప్రజావాణిలో ప్రజలు సమర్పించే వినతులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.కార్యక్రమంలో సిర్పూర్ (టి) మండలం భూపాలపట్నానికి చెందిన మంగెన భూదేవి వితంతు పింఛన్ మంజూరు చేయాలని, దహెగాం మండలానికి చెందిన భుతే దేవేందర్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం కౌటగూడకు చెందిన గెడం పద్మ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం అందించాలన్నారు. సిర్పూర్ (టి) రైల్వే కాలనీకి చెందిన గాదె సుభద్ర గృహజ్యోతి పథకం రాయితీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటకు చెందిన దుర్గం కావేరి తన పిల్లలకు గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించాలని విన్నవించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన చాపిడి సరోజ మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా ఉపాధి కల్పించాలని కోరారు. దహెగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కొట్లూరి దుర్గా గౌడ్ తాను సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టా మంజూరు చేసి పాసుపుస్తకం జారీ చేయాలని దరఖాస్తు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చెట్లను రక్షిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి జూలై 13 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని గరిడేపల్లి మండలం గారకుంటతండ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ బాణోతు అరుణ రమేష్ నాయక్ గ్రామ పెద్దలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చెట్లను రక్షిస్తే ఆ మొక్కలు మన పర్యావరణాన్ని కాపాడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌతమి సుధాకర్, గరిడేపల్లి మాజీ సర్పంచ్ బాణోతు సైదానాయక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు బూలీ బాయి, ఝాన్సీ బాయి, జయరాం, జలేంధర్, సైదానాయక్, సక్కి, సావిత్రి, ఫిల్డ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు వీరునాయక్, అంగన్వాడీ టీచర్ కవిత, ఆశవర్కర్ భవాని, వివోఏ సుధాకర్, గ్రామ పెద్దలు దీప్లానాయక్, సైదానాయక్, లాలూ, దేవేందర్, పాండు, సాంపు, నాగు, మహిళలు పాల్గొన్నారు.

# అంకిరెడ్డి గూడెం సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి

* **ప్రజావాణిలో కలెక్టర్ కు వార్డు సభ్యుల ఫిర్యాదు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో దివీస్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులు రూ.98లక్షల వ్యయంతో నిర్మాణం చేసుకుంటున్న సీసీ రోడ్డు పనులలో సర్పంచ్ మల్లేష్ గౌడ్ తెలంగాణ పంచాయత్ రాజ్ 2018 చట్టాన్ని ఉల్లంఘించారని ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఆరోపించారు. సోమవారం గ్రీవెన్స్ డే లో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా విధులను ఉల్లంఘన చేస్తూ, అధికార దుర్వినియోగంకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమ అనుచరులకు మద్దుతు ఇస్తూ గ్రామ పంచాయతీ భూములను, రోడ్లను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను కాపాడవలసిన సర్పంచ్ రోడ్డు ఆక్రమణకు ప్రత్యక్షంగా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పలు అక్రమాలకు పాల్పడుతున్న అక్కిరెడ్డిగూడెం సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రోడ్డుపై అక్రమంగా నాటిన కడీలు తొలగించాలని, ఆగిపోయిన గ్రామ సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి, అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ వలందాసు మహేష్ , వార్డు సభ్యులు బత్తుల అనూష , పాలెం వెంకటేష్ , ముద్దం లింగస్వామి , దొడ్ల అండాలు , దండుగుల వెంకటేష్ తదితరులున్నారు.

# నిర్దేశిత గడువులో ప్రజావాణి సమస్యలకు పరిష్కారం చూపాలి

* **జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిర్దేశిత గడువులోగా ప్రజావాణిలో వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపాలని, తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రతతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫోటో, వీడియో గ్రాఫర్ల గెట్ టుగెదర్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: 1990లో శ్రీ సాయి టెలివిజన్ మెకానిక్ పేరుతో ప్రస్థానం ప్రారంభించిన పాటి బండ్ల ప్రసాద్, శ్రీ సాయి వీడియోస్ ద్వారా ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగంలో విశేష సేవలందిస్తూ వందలాది మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించారు. తన వద్ద శిక్షణ పొంది ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో సొంత ఫోటో స్టూడియోలు నిర్వహిస్తున్న ఫోటో, వీడియో గ్రాఫర్లతో కొత్తగూడెంలోని శ్రీకృష్ణ ఇన్‌లో సోమవారం గెట్ టుగెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం శిష్యులు పాటి పండ్ల ప్రసాద్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని, కష్టపడి పనిచేస్తేనే వృత్తిలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మురళి, శేఖర్, శంకర్ యాదవ్, దశరథ్ రజువా, రఫీ, చందు, పాపారావు, వట్టికొండ రవి, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో సోలార్ టెక్నీషియన్ శిక్షణ ప్రారంభం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : సింగరేణి భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సోలార్ టెక్నీషియన్ శిక్షణా కార్యక్రమాన్ని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పునరుత్పాదక ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా సోలార్ విద్యుత్ రంగంలో నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లకు భవిష్యత్తులో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. శిక్షణ పొందుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో సోలార్ ప్యానెల్‌ల అమరిక, నిర్వహణ, లోపాల గుర్తింపు, మరమ్మతులు, ఇన్వర్టర్ వ్యవస్థలు, విద్యుత్ భద్రతా ప్రమాణాలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యువతను తీర్చిదిద్ది ఉపాధి అవకాశాలను విస్తరించడమే సింగరేణి లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీఎం ఎస్‌వో కృష్ణప్రసాద్, వి.టి.సి. మేనేజర్ నజీర్, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్, ట్రైనర్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు శంకరయ్యకు ఘన సన్మానం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కళాజాతల ద్వారా ప్రజలకు చేరవేస్తూ విశేష సేవలందించిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు మైసా శంకరయ్య (ఎర్రన్న) బదిలీ నేపథ్యంలో సోమవారం జిల్లా డిపిఆర్వో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సభ్య కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు శంకరయ్య విధుల నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా డిపిఆర్వో శీలం శ్రీనివాస్ ఆయన సేవలను కొనియాడారు. టీమ్ లీడర్‌గా సహచరులను సమన్వయం చేస్తూ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను కళాజాతల రూపంలో ప్రజలకు సమర్థవంతంగా చేరవేశారని ప్రశంసించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో చైతన్యం కల్పించడంలో శంకరయ్య చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శంకరయ్యను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రంజిత్, శ్రీనివాస్, కుమార్, ప్రవీణ్, రవి, రజిత, శ్యామల, శిరీష, స్వప్న, స్వాతి, నాగమణి తదితరులు పాల్గొని శంకరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 113 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 56, హౌసింగ్ 10, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్ 5, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 4, సంక్షేమ శాఖ 4,జిల్లా పరిషత్ 4, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 3, విద్యాశాఖ 3,వైద్య ఆరోగ్య శాఖ 3, వ్యవసాయ 2, ఉపాధి కల్పన 2, పంచాయతీ 2, సమాచార శాఖ, ఇరిగేషన్, ట్రాన్స్పోర్ట్, పశు సంవర్ధక శాఖ, ఫుడ్ సేఫ్టీ, ఫిషరీస్, కోపరేటివ్, అటవీ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కృతిక,జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , జెడ్పీ సీఈఓ శోభా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 15లోగా యూనిఫాంల పంపిణీ పూర్తి చేయాలి

**: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని రెసి డెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)విద్యా ర్థినులకు ఏకరూప దుస్తుల పంపిణీని 15 వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారు లను ఆదేశించారు. సోమవారం కలెక్టరే ట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించి న సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లా డుతూ, యూనిఫాంల కుట్టు పనులను సకాలంలో పూర్తి చేసి విద్యార్థినులకు ఆలస్యం లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నా ణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమావేశం లో డీఆర్డీఓ భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసి యా బేగం తదితర అధికారులు పాల్గొ న్నారు.

# 27న తెలంగాణ జర్నలిస్టుల "ఛలో పార్లమెంట్"

*** జంతర్ మంతర్ లో ఒకరోజు ధర్నా**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27వ తేదీన "తెలంగాణ జర్నలిస్టుల ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల డిమాండ్ల సాధనకై ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు వారు శనివారం నాడిక్కడ మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే




రాయితీ పాస్ ల పునరుద్ధరణ, జర్నలిస్టుల రక్షణ చట్టం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు తదితర డిమాండ్ల పై 27న ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద (జంతర్ మంతర్ లో) ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన స్కీం ను కేంద్ర ప్రభుత్వం గత కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించలేదని, దీంతో జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసుల సదుపాయాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్"ను ఏర్పాటు చేయాలని కోరారు. రిటైర్డ్ జర్నలిస్టులకు కొన్ని రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేదని, దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులను నిలువరించేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు పూర్తి స్థాయిలో చట్టబద్దత కల్పించాలని అన్నారు.ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# మన ఊరు మన బాధ్యత కార్యక్రమం

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలు, రహదారి భద్రత, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన , ప్రజల్లో సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'మన ఊరు మన బాధ్యత' కార్యక్రమం జిల్లావ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, యువత విశేష స్పందన తెలిపి పోలీస్ శాఖతో కలిసి ముందుకు వస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా మే నెలలో మొదటి విడతగా 36 గ్రామ పంచాయతీలు, 13 వార్డుల్లో, జూలై నెలలో రెండో విడతగా 54 గ్రామ పంచాయతీలు, 4 వార్డుల్లో నిర్వహించారు. మొత్తం 100కు పైగా గ్రామ పంచాయతీలు, వార్డుల్లో స్థానిక సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, గ్రామ కమిటీలు, ప్రజల సహకారంతో ఆయా పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వేలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి



ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో భారీ హెల్మెట్ బైక్ ర్యాలీలు, అవగాహన సమావేశాలు నిర్వహించి రహదారి భద్రత, మాదకద్రవ్యాల నివారణ, సీసీ కెమెరాల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.గార్ల మండలం గోపాలపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొని హెల్మెట్ బైక్ ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామ భద్రతకు గ్రామ ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. 'మన ఊరు మన బాధ్యత' కార్యక్రమం ద్వారా గ్రామాలు స్వచ్ఛందంగా తీసుకుంటున్న నిర్ణయాలు సమాజంలో గొప్ప మార్పుకు నాంది పలుకుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరి ప్రాణ రక్షణ కోసం 'నో హెల్మెట్.. నో ఎంట్రీ' నిబంధనను అమలు చేయాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా గంజాయి రహిత గ్రామాల లక్ష్యంతో ముందుకు సాగాలని, గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ప్రతి గ్రామం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.



# ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టే మహా ధర్నా ను జయప్రదం చేయాలి

**: డీవైఎఫ్ఐ**

జనగామ, ప్రజాస్ఫూర్తి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 15న హైదరాబాద్‌లోని ఇంద్రాపార్క్ వద్ద నిర్వహించే సీపీఎం మహాధర్నాను నిరుద్యోగ యువత జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జనగామ పట్టణ కార్యదర్శి పాము బిక్షపతి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డులో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షలకు పైగా ఖాళీ పోస్టులు, రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, పోలీస్ శాఖలో 20 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.5,000 భృతి, రాజీవ్ యువ వికాస్ పథకం అమలు, బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో బూడిది శ్రీకాంత్, పసలాది హరీష్, చిట్కూరి అశోక్, మదన్ కుమార్, బొల్లం దయాసాగర్, గాదెపాక అంబేద్కర్, బూడిది ప్రశాంత్, గుండె జీవితేజ్, మచ్చ సాయి గౌతమ్, బాలకృష్ణ, ఎం.డీ అజార్, అజయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతామన్న కేవీ ప్రసాద్

ప్రజాస్ఫూర్తి, నల్గొండ : లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 ఇ నూతన గవర్నర్‌గా హాంకాంగ్‌లో జరిగిన 108వ అంతర్జాతీయ సదస్సులో ప్రమాణ స్వీకారం చేసి నేడు స్వదేశానికి విచ్చేసిన పీఎంజెఎఫ్ లయన్ కేవీ ప్రసాద్, ఎమ్జెఎఫ్ లయన్ గీతావాణి కక్కిరేని దంపతులకు చర్లపల్లి బైపాస్ వద్ద క్లబ్ ప్రతినిధులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి భారీ ర్యాలీగా జిల్లా కేంద్రంలోని లయన్స్ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ భవన్‌లో నూతన గవర్నర్ దంపతులకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో, డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కేవీ ప్రసాద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సదస్సులో డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి వచ్చిన తమకు, చర్లపల్లి బైపాస్ నుండి లయన్స్ భవన్ వరకు లయన్స్ సభ్యులందరూ అత్యంత ఘనంగా, అపూర్వంగా స్వాగతం పలకడం మర్చిపోలేని అనుభూతిని కలిగించిందని ఆనందం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నిర్దేశించిన ఆశయాలకు అనుగుణంగా, సమాజంలో వెనుకబడిన వర్గాలకు మెరుగైన సేవలు అందించడమే మన ప్రధాన లక్ష్యం




కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని లయన్స్ క్లబ్ సభ్యులందరూ తనకు చేదోడు వాదోడుగా ఉంటూ, సేవా కార్యక్రమాల విస్తరణకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అందరి ఉమ్మడి కృషి, సమష్టి బాధ్యతతో డిస్ట్రిక్ట్ 320 E ని సేవా రంగంలో అగ్రభాగాన నిలిపి, మల్టిపుల్‌లోనే ప్రథమ స్థానాన్ని దక్కించుకునేందుకు తన శాయాశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అనంతరం వివిధ క్లబ్ బాధ్యులు గవర్నర్ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సతీష్ కుమార్ కోడె, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుడిపూరి వెంకటేశ్వర్ రావు, ఐపీడీజీ మదన్ మోహన్ రేపాల, మాజీ జిల్లా గవర్నర్లు తీగల మోహన్ రావు, జగినీ భీమయ్య, నేతి రఘుపతి, యానాల మోహన్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ నిమ్మల పిచ్చయ్య, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ యర్రమాద శ్రీనివాస్, జిల్లా జీఎస్‌టీ కోఆర్డినేటర్ బాచుపల్లి రవీందర్ రావు, మాజీ జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ గట్టుపల్లి అశోక్ రెడ్డి, వివిధ క్యాబినెట్ ఆఫీసర్లు, రీజియన్ చైర్మన్లు, జోన్ చైర్మన్లు, వివిధ క్లబ్ ల ప్రెసిడెంట్లు, సెక్రెటరీలు, ఆర్థిక కార్యదర్శులు మరియు ఇతర సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమరమే

**– ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్**
**– కలెక్టరేట్ ముట్టడి విజయవంతం**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అంగన్వాడీల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దని, వారి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే సమరం తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసఫ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్వాడీ టీచర్లు హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర రెండవ రోజైన సోమవారం పాల్వంచ పరిధిలోని పెద్దమ్మతల్లి దేవాలయం ఆవరణ నుండి ప్రారంభమైంది. ఈ పాదయాత్రను ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీగా పాల్వంచలోని అంబేద్కర్ సెంటర్ వరకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని వందలాది మందితో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిడబ్ల్యూఓ స్వర్ణలత లేనినకు అందజేశారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లాడుతూ అంగన్వాడీలు కట్టు బానిసలు కాదని, చాలీచాలని వేతనాలు ఇస్తూ అధిక పని భారంతో వెట్టి చాకిరీ చేయించుకోవాలనే ప్రభుత్వ వైఖరిని ఇకపై సహించేది లేదని స్పష్టం చేశారు.. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు, నరాటి ప్రసాద్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతా మహాలక్ష్మి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఈశ్వరి, కరుణకుమారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి అరుణ, గోనె మణి, ముర్వా లక్ష్మీ కుమారి, కంచర్ల జమలయ్య, వేల్పుల మల్లికార్జున్, రాజు, షాహిన్, ధనలక్ష్మి, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుద్ర నక్షత్ర వేళ శివార్చనలో జనగామ డీసీపీ

జనగామ, ప్రజాస్ఫూర్తి : ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి, చతుర్దశి ఒకే రోజున కలిసివచ్చిన విశిష్ట సందర్భంగా సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ శ్రీ ఉమామహేశ్వర



దేవాలయం లో శివపార్వతుల వారికి ప్రత్యేక పూజ లు, శివలింగానికి మహాభిషేకం వైభవం గా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆలయా న్ని సందర్శించి శివలింగానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సాంబమూర్తి శర్మ వేదమంత్రోచ్చారణల నడుమ పం చామృతాలు, సుగంధ ద్రవ్యాలతో శివ లింగానికి అభిషేకం చేసి బిల్వదళాలతో అర్చనలు నిర్వహించారు. అనంత రం మహామంగళహారతి, నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు కిరణ్, అరుణ్, ఆంజనేయులు, శ్రీకాం త్, వినయ్, మాధవి, రాణి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.

# పాలకుర్తి లో సీఎం రేవంత్ రెడ్డి కి పాలాభిషేకంతో కృతజ్ఞతలు



పాలకుర్తి/జనగామ, ప్రజాస్ఫూర్తి : రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా జిల్లా లోని పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్వి ని రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

## చౌడారం మోడల్ పాఠశాల సందర్శించిన కలెక్టర్

* నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల ఆ రోగ్య పరిరక్షణతో పాటు ప్రాథమిక వి ద్యా నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ అవసర మని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం మండలం లోని చౌడారం మోడల్ పాఠశాలను సం దర్శించిన ఆయన, జాతీయ నులిపు రుగుల నివారణ కార్యక్రమంలో భాగం గా విద్యార్థినులకు ఆల్బెండజోల్ మా త్రలను పంపిణీ చేశారు.. అనంతరం పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి పరిశుభ్రత పా టించాలని అధికారులను ఆదేశించారు.అన్ అకాడమీ డిజిటల్ తరగతుల ని ర్వహణను సమీక్షించి, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూ చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వ యంగా రూపొందించిన "గెట్ ఇట్ రైట్ " ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. అలాగే ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకాన్ని ప్రతిరోజూ బోధించి, ఇంగ్లీష్ గ్రామర్, ప దజాలం, గణిత ప్రాథమిక అంశాల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యా యులకు సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌ సియా బేగం, ఉపాధ్యాయులు, సిబ్బం ది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారు లను ఆశ్రయించినప్పుడు వారికి న్యా యం జరుగుతుందనే నమ్మకాన్ని క ల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కు మార్ ఝా అధికారులకు సూచించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లొం తో కలిసి ప్రజల నుంచి వినతుల ను స్వీకరించారు.వివిధ ప్రాంతాల నుం చి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు అందజేస్తూ, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశిం చారు. ఈ సందర్భంగా మొత్తం 335 ద రఖాస్తులు స్వీకరించారు. వీటిలో ఇంది రమ్మ ఇల్లు మంజూరు, వికలాంగ పించ న్, భూ పట్టా వివాదం, ప్రభుత్వ రెసిడె న్షియల్ పాఠశాలలో ప్రవేశం,వృద్ధాప్య పించన్ వంటి సమస్యలకు సంబంధిం చిన వినతులు ఉన్నాయి. ఈ కార్యక్ర మం లో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మా ణ శాఖ పీడీ మాతృ నాయక్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొ న్నారు.

### కాళేశ్వరం–మద్దులపల్లి ప్రధాన రహదారిపై

# ఇసుక లారీల పార్కింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత, కాళేశ్వరం-మద్దులపల్లి ప్రధాన రహదారిపై ఇసుక లారీల అక్రమ పార్కింగ్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో ఆమె పేర్కొన్న వివరాల ప్రకారం, ఇసుక కాంట్రాక్టర్లు వందలాది లారీలను ప్రధాన రహదారిపైనే గంటల తరబడి నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రయాణికులు, వాహన దారులు ఇబ్బందులు పడటంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు, పాఠశాల వాహనాలు, అత్యవసర సేవల కోసం వెళ్లే అంబులెన్స్‌లు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారిపై ఇసుక లారీల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధించాలని, ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను సర్పంచ్ ఎల్పుల సరిత కోరారు.గ్రామ ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు



## జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

* కలెక్టర్ కార్యాలయం ఎదుట టిడబ్ల్యూజేఎఫ్ ధర్నా –
* కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు వినతిపత్రం




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎండీ అయూబ్ జిల్లా కార్యదర్శి ఎండీ సాదత్ అలి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎండీ అయూబ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్నప్పటికీ, వారి సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల్లో అన్ని జర్నలిస్టు సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులను పరిరక్షించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎండీ సాదత్ అలి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి, కంట్రిబ్యూషన్ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని అన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను యుద్ధప్రాతిపదికన కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఉచిత ఆర్టీసీ, మెట్రో పాసులు మంజూరు చేయడంతో పాటు, రాత్రి వేళల్లో విధులు నిర్వహించే మహిళా జర్నలిస్టులకు కార్యాలయం నుంచి ఇంటి వరకు సురక్షిత ఉచిత రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా సమయంలో రద్దు చేసిన రైల్వే పాస్ సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు జర్నలిస్టుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ సభ్యులు పుప్పల మట్టయ్య, గుండాల యాదగిరి, వాడపల్లి రమేష్, మంద సైదులు, శివ కృష్ణ రామకృష్ణ, జిట్ట రమేష్, ఉమ మహేశ్వర్, రవి కుమార్, రఫీక్ ఖాన్, రవీందర్, క్రాంతి కుమార్ వెంకన్న, మురళి పంచలింగం తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నాం

: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ వ్యయం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటూ పేదలకు నాణ్యతలేని బియ్యాన్ని అందించిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల ఆహార భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీవో, స్థానిక సర్పంచ్, రేషన్ దుకాణం నిర్వాహకులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి కి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

* బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఆలయ అభివృద్ధి కి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ ఎన్ ఎల్ బి నగర్ "శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం , పోచమ్మ దేవస్థానం నూతన కమిటీ సభ్యులు సోమవారం పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులకు ముందుగా నా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ ఎం.బసవరాజ్, సలహాదారులు జేమ్స్, ఆకుల ప్రభాకర్ గుప్తా, ప్రెసిడెంట్ వేముల నాగరాజు గుప్తా, వైస్ ప్రెసిడెంట్ గుంజరి నరేష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వెంకటేష్, జనరల్ సెక్రెటరీ జి.క్రిష్ణ, ట్రెజరర్ వి.కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే కళాశాల బంద్

* ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు డిమాండ్

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు (జూలై 14) ఎబివిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కళాశాల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎబివిపి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు & స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాగిఫణి హనుమాన్ చారి తెలిపారు.ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




భారత మహిళా జట్టు అద్భుతం చేసింది. లార్డ్స్‌లో జరిగిన మొదటి మహిళల టెస్టు మ్యాచ్‌లో టీమ్ఇండియా (Womens India Team) విజయం సాధించి చరిత్ర సృష్టించింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. టీమ్ఇండియా నిర్దేశించిన 457 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 170 రన్స్‌కే ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 341/7 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది.



### ముందే డిసైడ్ అయిపోయింది..

దాదాపు మూడో రోజే టీమ్ఇండియా (Team India) విజయం ఖాయమైంది. ఓవర్ నైట్ 130/6 స్కోరుతో ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టిన ఇంగ్లాండ్ నాలుగో రోజు తొలి సెషన్‌లోపే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) అదనంగా మరో రెండు పరుగులు మాత్రమే జోడించింది. మ్యాడీ (24) వెంటనే ఔటైంది. అయితే, సోఫీ ఎకెల్‌స్టోన్ (50) కాసేపు పోరాడింది. ఓ వైపు వికెట్లు పడినా.. లోయర్ ఆర్డర్‌లో సోఫీ దూకుడుగా ఆడేసింది. ఓటమి వ్యత్యాసాన్ని మాత్రమే కాస్త తగ్గించగలిగింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలీ 2, క్రాంతి గౌడ్ 2, దీప్తి శర్మ 2 వికెట్లు చొప్పున తీశారు.

### సచిన్, జైషా సందడి

లార్డ్స్‌లో భారత మహిళా జట్టు తొలిసారి టెస్టు ఆడటంతో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ (Sachin Tendulkar) హాజరయ్యారు. ఆయనతోపాటు ఐసీసీ ఛైర్మన్ జైషా కూడా మ్యాచ్‌ను వీక్షించారు. ఈ మ్యాచ్‌తో ఇంగ్లాండ్ క్రికెటర్లు టామీ బ్యూమౌంట్, హీథర్ నైట్‌ల అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. ఇప్పటికే వారు కెరీర్‌కు వీడ్కోలు చెప్పిన సంగతి తెలిసిందే. లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో యస్తికా భాటియా (113) సెంచరీ సాధించింది. స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలు సాధించడం గమనార్హం. టీమ్ఇండియా బౌలర్ క్రాంతి గౌడ్ లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచింది. దీంతో సెంచరీ చేసిన యస్తికాతోపాటు క్రాంతి గౌడ్ ఆనర్స్ బోర్డులో పేరు లిఖించుకుంది.

## సీఎస్‌కే హెడ్ కోచ్ పదవి ఖాళీ.. రేసులో ఎవరెవరంటే?



ఐపీఎల్‌లో భారీ ఫ్యాన్‌బేస్ కలిగిన టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ (CSK). ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఆ జట్టుకు ఇప్పుడు ప్రధాన కోచ్ అవసరం వచ్చింది. దాదాపు 18 ఏళ్లపాటు సీఎస్‌కేతో ప్రధాన కోచ్‌గా కొనసాగిన స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలిగాడు. గత మూడు సీజన్లలో సీఎస్‌కే కనీసం ఒక్కసారి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకోలేదు. మేనేజ్‌మెంట్, ఫ్లెమింగ్ పరస్పర అంగీకారంతోనే నిర్ణయం తీసుకున్నా.. జట్టు ఘోర ప్రదర్శనకు ప్రధాన కోచ్ కారణమనే ఉద్దేశంతోనే తప్పించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో కొత్త ప్రధాన కోచ్ పదవి రేసులో తెరపైకి ఓ ఐదు పేర్లు వచ్చాయి. అందులో ఎంఎస్ ధోని కూడా ఉండటం గమనార్హం.

### అతడే ఫస్ట్ ఎంపిక?

సీఎస్‌కే అంటే ధోనినే అనేంతగా పేరు మారుమోగిపోయింది. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా.. అతడిని చూసేందుకు ప్రేక్షకులు మైదానాలకు భారీగా వచ్చారు. సీఎస్‌కే బ్రాండ్ విలువ పెరగడం వెనుక ధోనిదే కీలక పాత్ర. ఇప్పుడు స్టీఫెన్ ఫ్లెమింగ్ వెళ్లిపోవడంతో ధోనిపై బాధ్యతలు పెరుగుతాయడనంలో సందేహం లేదు. మరి వచ్చే సీజన్‌లోపే రిటైర్‌మెంట్ ప్రకటించి.. మెంటార్‌గా లేదా ప్రధాన కోచ్ ఏమైనా వస్తాడా? అనేది ఇప్పుడు అభిమానుల్లో నెలకొన్న ప్రశ్న.

### వీరు కూడానూ..

* టీమ్ఇండియా మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌ను సీఎస్‌కేకు తీసుకొచ్చే ఆలోచనలో మేనేజ్‌మెంట్ ఉన్నట్లు సమాచారం. ధోనితో ద్రవిడ్ కు మంచి సంబంధాలే ఉన్నాయి. సంజు శాంసన్ ఇప్పుడు సీఎస్‌కేలోనే ఉన్న సంగతి తెలిసిందే. భవిష్యత్తులో అతడే సారథి అయ్యే అవకాశం లేకపోలేదు. దీంతో ద్రవిడ్‌ను తీసుకుంటే బాగుంటుందేనేది వారి ఆలోచనగా తెలుస్తోంది.
* రాహుల్ ద్రవిడ్ తర్వాత.. సీఎస్‌కే మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్‌నూ పరిశీలించే అవకాశం లేకపోలేదు. అయితే, అతడికి నేరుగా ప్రధాన కోచ్ పదవిని ఇస్తారా? అంటే చెప్పలేని పరిస్థితి. ఒకవేళ సీఎస్‌కే అనుకుంటే అశ్విన్‌కు బౌలింగ్ కోచ్‌గా తొలుత బాధ్యతలు అప్పగించొచ్చు. మరోవైపు అశ్విన్ ఇంగ్లాండ్ టెస్టు జట్టుకు ప్రధాన కోచ్‌గా వెళ్తాడనే ప్రచారమూ ఉంది.
* రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెంటార్ దినేశ్ కార్తిక్ కూడా సీఎస్‌కేకు కోచ్‌గా రావచ్చని ప్రచారం సాగుతోంది. అయితే, ఆర్సీబీని వదిలి అతడు తన సొంత రాష్ట్రానికి చెందిన సీఎస్‌కేకు వస్తాడా? లేదా? అనేది కాస్త అనుమానమే. చెన్నై అభిమానులు కూడా వస్తే మంచిదనే కోరుకుంటారు. ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్‌ను వరుసగా రెండుసార్లు గెలవడంలో డీకే పాత్ర కూడా కీలకమైనదే.
* మొన్నటి వరకూ దిల్లీ క్యాపిటల్స్‌కు భారత మాజీ క్రికెటర్ హేమంగ్ బదానీ కోచ్‌గా ఉన్నారు. వరుస సీజన్లలో కనీసం ప్లేఆఫ్స్‌కూ క్వాలిఫై కాకపోవడంతో.. అతడిని ఇటీవలే ఆ ఫ్రాంచైజీ తప్పించింది. అయితే, అతడికి కోచ్‌గా మంచి నైపుణ్యమే ఉంది. మరి సీఎస్‌కే నుంచి హేమంగ్ బదానీకి రెజ్యూమె పంపించమని సమాచారం వెళ్తుందో లేదో చూడాలి.



## నేను టెర్మినేటర్.. వారిద్దరు నా అప్‌డేట్‌లు

* యువరాజ్ సింగ్

దూకుడుగా ఆడే అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీని భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ టెర్మినేటర్ క్యారెక్టర్‌తో పోల్చాడు. తనను తాను కూడా టెర్మినేటర్‌గానే భావిస్తానని.. అయితే, ఈ కుర్రాళ్లిద్దరూ తనకంటే ఫాస్ట్‌గా ఆడుతారంటూ కితాబిచ్చాడు. అభిషేక్, వైభవ్‌తో కలిసి నిన్న రాత్రి వింబుల్డన్ ఫైనల్ మ్యాచ్‌ను యువీ వీక్షించిన సంగతి తెలిసిందే. "నేనెప్పుడూ నన్ను టెర్మినేటర్‌గానే భావిస్తా. నాకంటే నాలుగు రెట్లు దూకుడుగా ఆడే అభిషేక్ శర్మను టెర్మినేటర్ 4గా పిలుస్తా. అతడి తర్వాత భారీ షాట్లు కొట్టే వైభవ్ సూర్యవంశీ రూపంలో టెర్మినేటర్ 6 వచ్చాడు. నేనాడిన సమయంలో నావంతు ప్రయత్నం చేశా. దానిని అభిషేక్ ఉన్నత స్థాయికి తీసుకెళ్లాడు. ఇప్పుడు వైభవ్ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ దూసుకుపోతున్నాడు. అంటే ఇది మూడో దశ. క్రికెట్ ఇలా వృద్ధి చెందడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది" అని యువీ వెల్లడించాడు.

### టెన్నిస్‌లో వారు..

"నాకు యనిక్ సినర్, అల్కరాజ్‌ను చూస్తున్నప్పుడల్లా టెన్నిస్ మారిపోయిందని అనిపిస్తుంది. క్రికెట్‌లో వైభవ్, అభిషేక్‌ను చూసినా ఇదే అభిప్రాయం. అభిషేక్‌తో చాలా సమయం ట్రైనింగ్ చేయించా. వైభవ్ తోనూ అలా గడపాలని ఉంది. అతడికి మంచి భవిష్యత్తు ఉంది. తప్పకుండా అతడు గొప్ప క్రికెటర్ అవుతాడు" అని యువీ తెలిపాడు.



# జనవరి వరకు బ్రేక్!

దీపికా పదుకోణ్ కొన్నాళ్ల పాటు సినిమాలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించింది. భర్త రణ్‌వీర్ సింగ్‌తో కలిసి ఈ గుడ్‌న్యూస్‌ను అభిమానులతో పంచుకుంది. ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు ఆరు నెలల పాటు దూరంగా ఉండనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. థర్డ్ ట్రైమిస్టర్ కారణంగా ఇబ్బందులు పడుతోన్నానంటూ ఇటీవలే ఓ వీడియోను అభిమానులతో పంచుకుంది కూడా. ఆగస్ట్ నుంచి వచ్చే ఏడాది జనవరి వరకు షూటింగ్‌లలో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. భార్య కోసం రణ్‌వీర్‌సింగ్ కూడా సినిమాలకు నాలుగు నెలలు బ్రేక్ ఇవ్వబోతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం దీపికా తెలుగులో అల్లు అర్జున్‌తో రాకా సినిమా చేస్తోంది. ఇందులో వారియర్ ప్రిన్స్ తరహాలో యాక్షన్ రోల్‌లో కనిపించబోతుంది. ఈ మూవీకి అట్లీ దర్శకత్వం వహిస్తున్నాడు.



# మరో ఛాన్స్ కొట్టేసింది!

టాలీవుడ్‌లో హిట్టు అందుకోవాలనే భాగ్యశ్రీ బోర్సే కల ఎట్టకేలకు లెనిన్‌తో నెరవేరింది. ఇప్పటి వరకు తెలుగులో నాలుగు సినిమాలు చేయగా సక్సెస్ మాత్రం దక్కలేదు. లెనిన్ విజయాన్ని ఆస్వాదిస్తోన్న ఈ అమ్మడు తెలుగులో మరో క్రేజీ ఆఫర్ దక్కించుకున్నట్లు వార్తలొస్తున్నాయి. శర్వానంద్ హీరోగా సీనియర్ డైరెక్టర్ శ్రీనువైట్ల దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ లవ్ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో హీరోయిన్‌గా భాగ్యశ్రీ ఛాన్స్ కొట్టేసినట్లు సమాచారం. తొలుత మలయాళ బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను హీరోయిన్‌గా అనుకోగా డేట్స్ ఈష్యూ వల్ల ఆమె స్థానంలో భాగ్యశ్రీని మేకర్స్ ఫైనల్ చేసినట్లు చెబుతున్నారు. త్వరలోనే అడుగుపెట్టబోతున్నట్లు తెలిసింది. మోడ్రన్ అమ్మాయిగా కనిపించనున్నట్లు వార్తలొస్తున్నాయి. అనిల్ సుంకరి నిర్మాతగా వ్యవహరిస్తుండగా జార్జ్ క్రిష్ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు.

# సినిమా

## డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ టీజర్ రిలీజ్

పుష్ప 2 తర్వాత మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ తెలుగులో మరో స్ట్రెయిట్ మూవీ చేయబోతున్నాడు. బాహుబలి ప్రొడ్యూసర్లతో కలిసి రాజమౌళి తనయుడు కార్తికేయ నిర్మిస్తున్న ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ సోమవారం రిలీజ్ చేశారు. సినిమాలో సూరి అనే మెజీషియన్‌గా ఫహాద్ ప్రధాన పాత్రలో కనిపించనున్నట్లు టీజర్‌లో చూపించారు. ఓ చిన్నారి ముందు తనకొచ్చిన మ్యాజిక్స్ చేసి చూపించగా ఆ చిన్నారి ఓ దయ్యం అనే నిజం తెలుస్తుంది. తప్పించుకోవడానికి సూరి ఏం చేశాడు? ఓ అద్భుత దీపంలో ఆ చిన్నారి ఎందుకు దాక్కొన్నది అనే అంశాలతో టీజర్ ఫన్నీగా సాగింది. ఈ టీజర్‌కు తెలుగులో ఫహాద్ ఫాజిల్ సొంతంగా డబ్బింగ్ చెప్పాడు. ఇందులో హీరోయిన్ పాత్ర లేకుండా కొత్త ప్రయోగం చేయబోతున్నట్లు తెలిసింది. డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు శశాంక్ ఏలేటి దర్శకత్వం వహిస్తున్నారు. అగ్ర దర్శకుడు రాజమౌళి ప్రజెంటర్‌గా వ్యవహరిస్తున్నారు.





## ఎస్ఎస్ఎస్ క్వాలిటీస్ ఉంటే చాలు

కాబోయే జీవిత భాగస్వామిలో ఎలాంటి క్వాలిటీస్ ఉండాలనే దానిపై శ్రీలీల ఆసక్తికర కామెంట్లు చేసింది. జస్ట్ మూడు క్వాలిటీస్ ఉంటే చాలంటోంది ఈ ధమాకా బ్యూటీ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి మాట్లాడుతూ తన మనసులో మాట బయటపెట్టింది. తాను పెళ్లి చేసుకోబోయే వాడు సెన్సిబుల్ మ్యాన్ అయ్యుండాలి.. సెన్సిటివ్‌గా ఉండటమే కాకుండా సెన్సాఫ్ హ్యూమర్ చాలా ఉండాలి అని ఈ మూడు క్వాలిటీస్‌ని పంచుకుంది. ఇంతకుమించి పెద్ద కోరికలేం లేవని పేర్కొన్నది. ఇంకా మాట్లాడుతూ సినిమాలను పెళ్లికి అడ్డంకిగా భావించడం లేదని చెప్పింది. రైట్ పర్సన్ ఎదురైతే పెళ్లి చేసుకొని సినిమాలను కంటిన్యూ చేస్తానని అన్నది. "కెరీర్, వ్యక్తిగత జీవితం రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడం చాలా ముఖ్యం.. భవిష్యత్తు కోసం కొన్ని ప్రణాళికలు వేసుకున్నా. వాటి ప్రకారమే ముందుకు సాగుతా అని శ్రీలీల చెప్పుకొచ్చింది. కాగా ఆమె చేసిన కామెంట్లు వైరల్ అవుతోన్నాయి. కాగా ప్రస్తుతం కోలీవుడ్‌లో ధనుష్‌తో ఓం సినిమా చేస్తోంది ఈ చిన్నది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.